

కోటపల్లి : సూపాకలో కరపత్రాలను పంచుతున్న జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అజ్గర్ మొహియుద్దీన్, సర్పంచ్ సతీశ్



చెన్నూర్ రూరల్ : నాగాపూర్‌లో..

# బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అజ్గర్ మొహియుద్దీన్

కోటపల్లి, అక్టోబర్ 28 : ముచ్చటగా మూడవసారి బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించి తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరించడం ఖాయమని జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు అజ్గర్ యెహియుద్దీన్ అన్నారు. కోటపల్లి మండలంలోని సూపాక గ్రామంలో భారత రాష్ట్ర సమితి మ్యానిఫెస్టో కరపత్రాలను జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అజ్గర్ మొహియుద్దీన్, సర్పంచ్ కాశెట్టి సతీశ్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజ్గర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు ప్రజల నుంచి ఎనలేని ఆదరణ లభిస్తుందన్నారు. బాల్క సుమన్ పై పోటీ చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు అభ్యర్థులే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. చెన్నూర్ ఎమ్మెల్యేగా బాల్క సుమన్ అధిక మెజార్టీతో గెలిపించి, కేసీఆర్‌ను మూడవసారి సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్కం ఆనంద్, సంతోష్, ప్రవీణ్, రామన్న, ముఖేశ్, నగేశ్, పున్నం బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**చెన్నూర్ మండలంలో..**

చెన్నూర్ రూరల్ అక్టోబర్ 28: చెన్నూర్ మండలంలోని సుబ్బరాంపల్లి, లంబాడీపల్లి, ఓత్కులపల్లి, నాగాపూర్, కిష్టంపేట, కొమ్మెర, పొక్కూర్, ముత్తరావుపల్లి కత్తరశాల గ్రామాల్లో బీఆర్ఎస్ సర్కారు ఇప్పటివరకు ప్రవేశ పెట్టిన పథకాలు, చేసిన అభివృద్ధి పనులు, ప్రస్తుత మ్యానిఫెస్టోను వివరించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులను నమ్మవద్దన్నారు. బీఆర్ఎస్ విజయం కోసం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు రత్న సమ్మిరెడ్డి, ఎంపీటీసీ నగావత్ శ్రీనివాస్, సర్పంచ్‌లు అయిత పార్వతి, అన్నల మానస, బుర్ర రాకేశ్‌గౌడ్, మాడ సుమలత, మాజీ సర్పంచ్ బండారి సత్యనారాయణ, నాయకులు అయిత సురేశ్‌రెడ్డి, మాడ మాధవ రెడ్డి, తుపాకుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మందమర్రి : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**మందమర్రిలో..**

మందమర్రి, అక్టోబర్ 28: మందమర్రి పట్టణంలో బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు యాపల్ ఏరియా, 7వ వార్డు మూడవ జోన్, 11వ వార్డు రెండవ జోన్ కార్మిక కాలనీల్లో బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల మెనిఫెస్టో కరపత్రాలను అందించి నవంబర్ 30న జరగనున్న శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపి కారు గుర్తుకు ఓటు వేసి ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌ను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించి నియోజక వర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో నియోజక వర్గంతో పాటు మందమర్రి మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. నవంబర్ 7న రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నియోజక వర్గ పర్యటనలో భాగంగా మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్న ప్రగతి నివేదన సభలో పాల్గొని అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తారని తెలిపారు. పెద్ద సంఖ్యలో సభకు తరలి వచ్చి విజయవంతం చేయాలని బొట్టుపెట్టి ప్రజలను ఆహ్వానించారు. ఆయా వార్డుల్లో సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు, కార్యకర్తల ప్రచారంతో కాలనీలు గులాబీమయమయ్యాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్, మహిళా, యూత్ విభాగం, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

**క్యాతనపల్లిలో 2వ వార్డులో..**

రామకృష్ణాపూర్,అక్టోబర్ 28: క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 2వ వార్డులోని జ్యోతినగర్‌లో కౌన్సిలర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు గడప గడపకూ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ తిరిగి బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా కారు గుర్తు ఓటు వేయాలని కోరారు. బాల్క సుమన్‌ను మరోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేముల వెంకటేశం, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్ : రెండవ వార్డులో మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్

## ఓటు హక్కుపై ప్రచారం




సిర్సా గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

కోటపల్లి, అక్టోబర్ 28 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటున్నది. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పేరిట ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుపుతూ ఫ్లెక్సీలను ముద్రించగా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటు చేశారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించారు.

## కుమ్రంభీమ్ నివాళి



కుమ్రం భీం చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం, ఏఈలు

కోటపల్లి, అక్టోబర్ 28 : కోటపల్లి మండలంలోని భావనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆదివాసీ వీరుడు కుమ్రం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం బొలిశెట్టి బుచ్చన్న, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రీనాథ్ స్వామి, మిషన్ భగీరథ ఏఈ వివేక్ ఆధ్వర్యంలో భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమ్రంభీం చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు.

## పేద కుటుంబానికి బాల్క ఫౌండేషన్ చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, అక్టోబర్ 28: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు మూడవ జోన్ కాలనీకి చెందిన జంగం మొగిలి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో మొగిలి మృత దేహానికి అంత్యక్రియలు చేయలేని పరిస్థితి. స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌కు తెలుపగా తక్షణమే స్పందించి మొగిలి దహన సంస్కారాలకు బాల్క ఫౌండేషన్ ద్వారా 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు మొగిలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంగిసది, రాకం సంతోష్, కైటం శ్రీనివాస్, జనార్దన్, మన్యం చామంత్, బావండ్లపల్లి నాగరాజు, గొట్టె అశోక్, చందు తదితరులున్నారు.

## కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

హాజీపూర్, అక్టోబర్ 28 : జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టర్ చాంబర్‌లో తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గడియారం శ్రీహరి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి హన్మంత రెడ్డి, రాంకుమార్, తిరుపతి, అశోక్, శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన టీఎన్జీవో సభ్యులు పాల్గొన్నారు.

## ఈసీకి విశిష్ట అధికారాలు

నస్పూర్, అక్టోబర్ 28 : ఎన్నికల నేపథ్యంలో ఈసీకి విశిష్ట అధికారాలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, అకౌంటింగ్ ఖర్చుల పరిశీలన బృందాలను నియమించి 24 గంటల పాటు నిఘా పెడుతున్నామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రకటనలపై తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులు మంచి ప్రవర్తన, కనీస ప్రమాణాలను తప్పకుండా పాటించాల్సి ఉంటుందన్నారు.

## వరి పంటల పరిశీలన



రైతులకు అవగహన కల్పిస్తున్న ఏఈవో అరుణ్ కుమార్

భీమారం, అక్టోబర్ 28 : భీమారం మండలంలోని అంకుశపూర్ గ్రామ పరిధిలో ఉన్న వరి క్షేత్రాన్ని ఏఈవో శనివారం సందర్శించారు. ప్రస్తుతం వరి పంటలో కంకినల్లి, నల్లి, సుడిదోమ గమనించినట్లు వారు తెలిపారు. దీని నివారణకు ప్రోసర్‌గైట్ –400 ఎంఎల్, లేదా ప్రోఫినోఫాస్ –400 ఎంఎల్, డైనోటెఫురాన్–80 గ్రాములు. పైమెట్రోజైన్ 120 గ్రాములు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

## ఘనంగా కోజాగర పౌర్ణమి

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 28 : చెన్నూర్ పట్టణంలో కోజాగర పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయం, జగన్నాథాలయం, చోటాహనుమాన్‌తో పాటు పలు ఆలయాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు భజనలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అర్ధరాత్రి పాలల్లో చంద్రుని ప్రతిబింబాన్ని దర్శించి, వాటిని ప్రసాదంగా స్వీకరించారు. జగన్నాథాలయంలో ప్రధాన అర్చకుడు దామెర మోహనాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు ఉమేశ్ గిల్డా, సురేశ్ దేవుడా, నడిపెల్లి లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకుడు గర్రెపల్లి వెంకటనర్సయ్య, వికాస తరంగిణి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**చంద్రగ్రహణం.. ఆలయాల మూసివేత**

చంద్రగ్రహణం సందర్భంగా చెన్నూర్ పట్టణంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఆలయాలను మూసివేశారు. చంద్రుడు, సూర్యుడికి మధ్య భూమి వచ్చినప్పుడు చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. మన దేశకాలమాన ప్రకారం శనివారం అర్ధరాత్రి 1.05 నిమిషాలకు గ్రహణం ప్రారంభమై, తెల్లవారుజామున 2 గంటల 23 నిమిషాలకు పూర్తయ్యింది. గ్రహణ సమయానికి ఆరుగంటల ముందు ఆలయ తలుపులు మూసివేయడం ఆనవాయితీ కావడంతో సాయంత్రం నుంచి పలు ఆలయాలు మూసివేసి ఉంచారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయాలను శుద్ధిచేసి సర్వదర్శనానికి అనుమతించారు. చంద్రగ్రహణం సందర్భంగా పలువురు భక్తులు చెన్నూర్‌లోని ఉత్తరవాహినీ గోదావరిలో స్నానమాచరించారు. గ్రహణం నేపథ్యంలో పలువురు తమ భోజనాలను శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకే ముగించారు.



భజన చేస్తున్న భక్తులు